# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 28-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- సంక్షోభ సమయంలో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా దేశాభివృద్ధి కొనసాగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు.
- దేశవ్యాప్తంగా ఇంధన సరఫరా వ్యవస్థ అత్యంత సురక్షితంగా, స్థిరంగా ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.
- అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావం ప్రజలపై పడకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 132వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.
- ఐపిఎల్ 26 ఆరంభ మ్యాచ్ లో ఈరోజు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడుతున్నాయి.

= = = = = = = = = = = = = = = = = =

ప్రపంచం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా దేశంలో ఎలాంటి అంతరాయం లేకుండా అభివృద్ధి కొనసాగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో 11,200 కోట్ల రూపాయలతో నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయం తొలి దశను ఆయన ప్రారంభించారు. 40 ఎకరాల్లో నిర్మించనున్న 'మెయింటెనెన్స్ రిపేర్ అండ్ ఓవర్ హాల్' (MRO) కేంద్రానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధానమంత్రి మాట్లాడుతూ.. ఈ విమానాశ్రయం ద్వారా పశ్చిమ యూపీలోని రైతులు, చిన్న మధ్యతరహా పరిశ్రమలు, యువతకు అపారమైన అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పశ్చిమాసియాలో ప్రపంచవ్యాప్తంగా ఆహారం, చమురు, ఎరువుల కొరత వేధిస్తోందని, యుద్ధం కారణంగా ఎదురవుతోన్న సవాళ్లను భారత్ పూర్తి శక్తితో ఎదుర్కొంటోందని తెలిపారు. సంక్షోభ ప్రభావం సామాన్యులు, రైతులపై పడకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ప్రధానమంత్రి పేర్కొంటూ ...

(వాయిస్…30 సెకన్లు)

ఈ కార్యక్రమంలో ఉత్తర ప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావం భారత ప్రజలపై పడకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో తాజా పరిస్థితులపై సమీక్షించేందుకు సీనియర్ మంత్రులతో కూడిన బృందం ఈరోజు ఢిల్లీలో భేటీ అయింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇంధన సరఫరా, నిత్యావసర వస్తువుల లభ్యతపై చర్చించారు.

ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. దేశ ఇంధన భద్రతకు ముప్పు వాటిల్లకుండా, నిత్యావసర వస్తువుల ధరలు పెరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టామని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు నిండుకున్నాయని, కేవలం ఐదు నుంచి పది రోజులకు సరిపడా మాత్రమే నిల్వలు ఉన్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇవన్నీ పూర్తిగా అవాస్తవాలని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా ఇంధన సరఫరా వ్యవస్థ అత్యంత సురక్షితంగా, స్థిరంగా ఉందని వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో సుమారు 64 రోజులకు సరిపడా చమురు నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. వ్యూహాత్మక నిల్వ సామర్థ్యంతో కలిపి మొత్తం 74 రోజుల వరకు ఇంధన అవసరాలను తీర్చగల శక్తి భారత్‌కు ఉందని పేర్కొంది. ఎక్కడా పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ కొరత లేదని స్పష్టం చేసింది. ఇంధన లభ్యతపై ప్రభుత్వం అధికారికంగా జారీ చేసే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్ర భద్రతను పట్టించుకోలేదని, ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిందని కేంద్ర హోం శాఖా మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా విమర్శించారు. కోల్‌కతాలో ఈరోజు నిర్వహించిన 'జనగణ్ ఛార్జ్‌షీట్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. మమతా బెనర్జీ అక్రమ వలసదారులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. అక్రమ వలసదారుల కారణంగానే బెంగాల్‌లోని స్థానిక కార్మికులకు దక్కాల్సిన కనీస వేతనాలు కూడా దక్కడం లేదని విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR) అంశంలో రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘంపై దాడి చేయడం సరికాదని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని పట్టణ ప్రాంతాల్లో పైప్డ్ నేచురల్ గ్యాస్ (PNG) సేవలను విస్తరించడం, నిత్యావసర సేవల సరఫరాలో అంతరాయం లేకుండా చూడటమే లక్ష్యంగా ఢిల్లీలో ఈరోజు ఉన్నత స్థాయి రౌండ్ టేబుల్ సమీక్షా సమావేశం జరిగింది. కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, హర్దీప్ సింగ్ పురి, ప్రహ్లాద్ జోషీ ఈ భేటీలో పాల్గొని పీఎన్‌జీ నెట్‌వర్క్ విస్తరణపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రి హర్దీప్ సింగ్ పురి మాట్లాడుతూ ప్రపంచ ఇంధన రంగంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని, దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసేందుకు పీఎన్‌జీ మౌలిక సదుపాయాల కల్పన అత్యవసరమని స్పష్టం చేశారు. మౌలిక వసతులు అందుబాటులో ఉన్నచోట పీఎన్‌జీ వాడకాన్ని ప్రోత్సహించాలని రాష్ట్రాలు, పట్టణ స్థానిక సంస్థలకు ఆయన పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 132వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.
“మన్ కీ బాత్” తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు సౌదీ అరేబియా యువరాజు, ఆ దేశ ప్రధాని మహమ్మద్ బిన్ సల్మాన్ తో టెలిఫోన్ ద్వారా చర్చలు జరిపారు. ప్రస్తుత యుద్ధ వాతావరణం నేపథ్యంలో అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో నౌకాయాన స్వేచ్ఛను కాపాడటం అత్యవసరమని ఇరువురు అభిప్రాయపడ్డారు. సరకు రవాణా నౌకల రాకపోకలకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా, షిప్పింగ్ లైన్లు సురక్షితంగా ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని వారు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రాంతీయ ఇంధన మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను భారత్ ఖండిస్తోందని సామాజిక మాధ్యమ వేదికగా ప్రధానమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ వాణిజ్య సంస్థ మనుగడకు సభ్య దేశాల మధ్య విశ్వాసాన్ని పునరుద్ధరించడం అత్యవసరమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. కామెరూన్‌లో జరుగుతున్న డబ్ల్యూటీఓ 14వ మంత్రివర్గ స్థాయి సదస్సులో భాగంగా నిర్వహించిన ప్రత్యేక సెషన్‌లో ఆయన ప్రసంగించారు. ఏకాభిప్రాయంతో కూడిన నిర్ణయాధికారమే ఈ సంస్థకు పునాది అని, ఇందులో ఎటువంటి రాజీ ఉండకూడదని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

(వాయిస్...30 సెకన్లు)

సదస్సు ప్రాంగణంలో అమెరికా వాణిజ్య ప్రతినిధి జామీసన్ గ్రీర్‌తో పీయూష్ గోయల్ చర్చలు జరిపారు. అలాగే దక్షిణ కొరియా వాణిజ్య మంత్రి యో హాన్-కూ, న్యూజిలాండ్ మంత్రి టాడ్ మెక్లే, స్విట్జర్లాండ్ స్టేట్ సెక్రటరీ హెలెన్ బుడ్లిగర్ ఆర్టిడాతో పీయూష్ గోయల్ వాణిజ్య చర్చలు జరిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ సాంస్కృతిక వైభవానికి ప్రతీకలైన మూడు పురాతన విగ్రహాలు త్వరలో స్వదేశానికి చేరుకోనున్నాయి. గతంలో దేశం నుంచి అక్రమంగా తరలించినట్లు నిర్ధారణ కావడంతో, అమెరికాలోని స్మిత్ సోనియన్ నేషనల్ మ్యూజియం ఆఫ్ ఏషియన్ ఆర్ట్ (NMAA) వీటిని తిరిగి భారత్‌కు అప్పగించేందుకు అంగీకరించింది. దీంతో 9వ శతాబ్దానికి చెందిన 'శివ నటరాజ' కాంస్య విగ్రహం, 12వ శతాబ్దానికి చెందిన శివపార్వతుల 'సోమస్కంద' శిల్పం, 16వ శతాబ్దానికి చెందిన శైవ భక్తుడు సుందరార్, ఆయన భార్య పరవై నాచియార్ విగ్రహాలు భారత్ కు చేరనున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = =

ఈశాన్య రాష్ట్రాల్లో రేపటి వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హెచ్చరించింది. మధ్య భారతంలోని ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, విదర్భ ప్రాంతాల్లో రేపు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలతో పాటు వడగళ్ల వాన పడే సూచనలు ఉన్నాయని వెల్లడించింది. ఈ నెల 29వ తేదీ వరకు ఢిల్లీ, పంజాబ్, రాజస్థాన్, హర్యానా, చండీగఢ్, ఉత్తరాఖండ్, బీహార్, పశ్చిమ ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది.

= = = = = = = = = = = = = = = = = = = =

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL) 19వ సీజన్ ఈరోజు సాయంత్రం బెంగళూరులో ప్రారంభమైంది. ఎం. చిన్నస్వామి స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ ఆరంభ పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడుతున్నాయి. ఈ సీజన్ తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆర్‌సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నారు. దీంతో బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ కడపటి వార్తలందేసరికి 12 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 111 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =